


ఒంటికాలిపై, కళ్లకు గంతలతో..


18వ రోజు అంగన్వాడీల వినూత్న నిరసన 6లో..



ఏలూరు కలెక్టరేట్ వద్ద కళ్లకు గంతలతో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు



విద్యాదీవెన నిధులు విడుదల చేస్తున్న సిఎం జగన్



భీమవరంలో పోలీసు స్టేషన్ వద్ద అంగన్వాడీలు, ప్రజాసంఘాల నేతలు ఆందోళన



ప్లకార్డుతో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం నిరసన



పోలీసు స్టేషన్‌లో గోపాలన్, గోపీమూర్తి, రంగారావు



ఆకివీడుల పోలీసు స్టేషన్ వద్ద అంగన్వాడీల ఆందోళన

అరెస్టులు.. నిర్బంధాల నడుమ

సిఎం పర్యటన

60 మంది అంగన్వాడీల అరెస్టు : పలు స్టేషన్లకు తరలింపు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాంతోపాటు పలువురిపై నిర్బంధకాండ

సిపిఎం, సిపిఐ, బిజెపితోపాటు యుటిఎఫ్, సిఐటియు నేతల అరెస్టు


పోలీసుల వలయంలో భీమవరం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ నేతలు, ప్రజలు

భీమవరం నియోజకవర్గానికి పలు హామీలు గుప్పించిన సిఎం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/భీమవరం రూరల్

సిఎం జగన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం భీమవరంలో పోలీసులు వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులపై పోలీసుల అరెస్టులు, నిర్బంధాలతో విరుచుకుపడ్డారు. దాదాపు 1800 మంది పోలీసులు భీమవరం పట్టణంలో మోహరించడం గమనార్హం. ఎటువంటి నోటీసూ ఇవ్వకుండానే ముందస్తుగా రాత్రికి రాత్రి ఇళ్లకు వెళ్లి కొందరు నేతలను హౌస్ అరెస్ట్ చేయగా మరికొందరిని ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించారు.



సిఎంకు గ్రంధి, మోషేన్‌రాజు స్వాగతం

విద్యాదీవెన సొమ్ము విడుదల సందర్భంగా శుక్రవారం భీమవరంలో సిఎం జగన్ పర్యటన సాగింది. ఉదయం 11.40 గంటలకు భీమవరం లూథరన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకున్నారు. అక్కడి నుంచి బైపాస్ రోడ్డులోని సభకు రోడ్డు మార్గం గుండా సిఎం చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సిఎం తన ప్రసంగం ముగించి ఆయన వెళ్లే వరకు పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తాయి. అరెస్టుల పేరుతో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, అంగన్వాడీలపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు. సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాంను ఆ పార్టీ జిల్లా కార్యాలయంలోనే నిర్బంధించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, బిజెపి నాయకులు శ్రీనివాసవర్మను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం నేత జెఎన్‌వి.గోపాలన్ స్టేషన్‌లోనే నిరాహార దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. తమ సమస్యలపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలపై పోలీసులు మరింత విరుచుకుపడ్డారు. సిఐటియు కార్యాలయం వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద మొత్తం 60 మంది అంగన్వాడీలను అరెస్ట్ చేసి భీమవరం, కాళ్ల పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంగన్వాడీ నాయకులు సిహెచ్.మహాలక్ష్మి, కనకదుర్గలను ముందుగానే గృహనిర్బంధం చేయగా మరో నాయకురాలు విజయలక్ష్మిని భీమవరంలో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో సిఐటియు నాయకులు ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు అంగన్వాడీలు పెద్దసంఖ్యలో చేరుకుని అక్రమ అరెస్టులను నిరసిస్తూ నాయకులను తక్షణమే విడుదల చేయాలంటూ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్టుల విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు, కార్మిక సంఘం నాయకులు వారికి మద్దతుగా చేరి నినదించారు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం మోపిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని హెచ్చరించారు.






కలెక్టర్ ప్రశాంతి

జగన్మోహన్‌రెడ్డికి భయమెందుకు..?

అక్రమ అరెస్టులు, నిర్బంధం నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మీడియాతో మాట్లాడుతూ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 175కు 175 ఎంఎల్‌ఎ సీట్లు గెలుచుకుంటామని గొప్పలు చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డికి భయమెందుకని ప్రశ్నించారు. ఎటువంటి నిరసన కార్యక్రమాలకూ పిలుపునివ్వనప్పటికీ ప్రజాసంఘాల నాయకులను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని నిలదీశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం అవలంబించడం వల్లే ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఆ భయంతోనే పోలీసులను అడ్డం పెట్టుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. అరెస్టులు కాదని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడమే ముఖ్యమంత్రి పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చేతనైతే సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాలో కాలుష్యం, డెల్టా ఆధునీకరణ, పంట నష్టం, కౌలు రైతులు, దళితుల శ్మశానాలు, రోడ్ల అధ్వాన సమస్యలు, అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగులు వంటి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు లేవన్నారు. కరెంట్ ఛార్జీలు, పన్ను పెంపుతో జగన్ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు.

భీమవరం నియోజకవర్గానికి సిఎం వరాలు

భీమవరం నియోజకవర్గానికి సిఎం జగన్ వరాల జల్లు ప్రకటించారు. విద్యాదీవెన నిధుల విడుదల సందర్భంగా శుక్రవారం భీమవరంలో సిఎం పర్యటన సాగింది. బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పెద్దపీట వేసిందన్నారు. నాడు-నేడు, అమ్మఒడి, గోరుముద్ద, ట్యాబ్‌ల పంపిణీ, ఆణిముత్యాలుగా గుర్తించి సత్కారం, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన.. ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. విద్యపై నెల్సన్ మండేలా చెప్పిన మాటలను సిఎం జగన్ నిజం చేశారన్నారు. అనంతరం స్థానిక ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరంలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. జిల్లా విభజన తర్వాత మొట్టమొదటిసారి సిఎం జిల్లా కేంద్రం భీమవరానికి విచ్చేశారన్నారు. తన తండ్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తరహాలోనే జగన్ తన కుటుంబాన్ని ప్రోత్సహించారన్నారు. 2019 ఎన్నికల్లో తాను పోటీ చేయనని చెప్పగా జగన్ ధైర్యం చెప్పి పోటీ చేయించారన్నారు. పవన్, చంద్రబాబుపై పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను సిఎంకు వివరించారు. జగనన్న లేఅవుట్ పూడికకు రూ.39.34 కోట్లు, హౌసింగ్ లేఅవుట్, రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5.30 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రి, ఫుట్‌పాత్ బ్రిడ్జి పక్కన మరో ఫుట్‌పాత్ బ్రిడ్జి ఏర్పాటుకు రూ.5.80 కోట్లు, గొంతేరు డ్రెయిన్‌పై బ్రిడ్జికి రూ.12 కోట్లు, భీమవరం-నర్సాపురం తొక్కోడు డ్రెయిన్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో కోరిన విధంగా వంద పడకల ఆస్పత్రికి రూ.28 కోట్లు, యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జిలకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. సిఎం తన ప్రసంగం పూర్తయిన తర్వాత చివరకు గ్రంధి శ్రీనివాస్‌ను తన పక్కకు పిలుచుకుని గత ఎన్నికల్లో భీమవరంలో సినిమా హీరోను చూశారని, కాని నిజమైన రియల్ హీరో గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంత్రి పదవి ఇవ్వకపోయినా పర్వాలేదని, భీమవరాన్ని జిల్లా కేంద్రంగా కావాలని కోరారన్నారు. ఆయన కోరిన సమస్యలకు సంబంధించి నిధులు మంజూరు చేస్తున్నట్లు సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, కొట్టు సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్‌ఎలు వాసుబాబు, ప్రసాదరాజు, రంగనాథరాజు, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్, జడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సిఎం జగన్‌కు ఫొటో అందిస్తున్న గ్రంధి, కవురు శ్రీనివాస్



పాలకొల్లులో యుటిఎఫ్ జిల్లా నేత రామభద్రం అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

భీమవరంలో శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథ్యంలో భీమవరం వెళ్లకుండా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎకెవి.రామభద్రంను గురువారం రాత్రి నోటీసులిచ్చి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్‌కూ భీమవరం వెళ్లరాదని నోటీసులు జారీ చేశారు. అంగన్వాడీ నేతల కోసం పోలీసులు జల్లెడ పట్టారు.

కాళ్ల: భీమవరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మండలంలోని సిఐటియు మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ, అంగన్వాడీ, ఆశా నేతలను భీమవరం వెళ్లనీయకుండా అరెస్టు చేసి కాళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద అంగన్వాడీలు, ఆశాలు ధర్నా నిర్వహించారు.

గృహనిర్బంధాలు.. అరెస్టులు

అక్రమంగా అరెస్టు చేసిన నేతలను విడుదల చేయాలని స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్‌రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు ఖండించారు. ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేసి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

ఆకివీడు: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భీమవరం పర్యటన సందర్భంగా శుక్రవారం సిపిఎం, సిఐటియు నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురువారం రాత్రి నుండి స్థానిక నాయకులు కె.తవిటినాయుడు, డోకల రవితేజ, బొక్కా వర్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణిలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం కళ్యాణి భీమవరం వెళ్లేందుకు సిద్ధమవ్వగా పోలీసులు అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే సమయంలో భీమవరం ప్రాంత అంగన్వాడీలను ఆకివీడు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారంతా కలిసి స్టేషన్ ప్రాంగణంలోనే ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. స్థానిక సిఐటియు నాయకులు, అంగన్వాడీలు సుమారు 70 మంది సమ్మె శిబిరం నుంచి పోలీస్ స్టేషన్‌కు ప్రదర్శనగా చేరుకుని నేతలను విడుదల చేయాలని బైఠాయించారు. సిఎం పర్యటన ముగిసిన అనంతరం భీమవరం అంగన్వాడీలను పోలీసులు తీసుకెళ్లి వారి సమ్మె శిబిరం వద్ద వదిలారు.



తాడేపల్లిగూడెంలో కర్రి నాగేశ్వరరావుకు నోటీసు

29,111 మందికి విద్యా దీవెన లబ్ధి : కలెక్టర్

ఏలూరు:జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద ఈ ఏడాది జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి సంబంధించి 29,111 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు, విద్యార్థుల జాయింట్ బ్యాంక్ ఖాతాలకు రూ.22.45 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు సిఎం జగన్ శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన జగనన్న విద్యా దీవెనలో కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా తల్లులు, విద్యార్థుల, జాయింట్ ఖాతాల్లో సొమ్ములు జమచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెనలో అర్హులైన పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లులు, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లో నేరుగా జమ చేస్తోందన్నారు.

జిల్లాలో 9,022 ఎస్‌సి విద్యార్థులకుగాను రూ.6.64 కోట్లు, ఎస్‌టి విద్యార్థులు 1309 మందికి రూ.66 లక్షలు, బిసి విద్యార్థులు 12,032 మందికి రూ.9.33 కోట్లు, ఇబిసి విద్యార్థులు 2268 మందికి రూ. 2.21 కోట్లు, ముస్లిము మైనారిటీ విద్యార్థులు 694 మందికి రూ.57 లక్షలు, కాపు విద్యార్థులు 3,436 మందికి రూ.2.75 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు 350 మందికి రూ.28 లక్షలు మొత్తం 29,111 మందికి రూ.22.45 కోట్లు ప్రభుత్వం జమచేసిందన్నారు.

పదో రోజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ఏలూరు అర్బన్:సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా పదో రోజు శుక్రవారం ఏలూరులో భారీప్రదర్శన నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయం నుండి స్టేట్ బ్యాంక్, రిజిస్టర్ ఆఫీస్ మీదుగా డిఇఒ కార్యాలయం, ఫైర్ స్టేషన్ మీదుగా జిల్లా పరిషత్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వారం రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పని భారం తగ్గించాలని విజ్ఞప్తిచేశారు. అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్ ఛార్ట్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు భగవాన్, కమలాకర్, పౌల్ రాజు, క్రాంతి, దిలీప్, బాలాజీ, రాజు, సత్య, చినబాబు, శ్రీనివాసరావు, వీరమణి, శ్యామల, జాన్సీ, వెంకటలక్ష్మీ, కుమారి, కె.లక్ష్మీకాంతం, భవానీ పాల్గొన్నారు.

ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన

నాలుగో రోజుకు సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులుగా జరుగుతున్న సమ్మెలో భాగంగా శుక్రవారం ఏలూరు నగరపాలక సంస్థ వద్ద కార్మికులు ఉరి తాళ్లతో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, మున్సిపల్ శాఖ మంత్రితో జరిగిన చర్చలు సఫలం కాలేదని, అందుకే మున్సిపల్ కార్మికులు తమకు ఇక ఉరే శరణ్యమంటూ ఉరితాళ్లతో తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు నాయకత్వం వహించారు. మున్సిపల్ కార్మికులు తమ నిరసనలో భాగంగా ఉదయం నుండే మున్సిపల్ ఆఫీస్ వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ అమరావతిలో మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో జరిగిన చర్చల్లో నిర్దిష్టమైన హామీలు లేవని తెలిపారు. అందువల్ల కార్మికుల సమ్మెను ఉధృతం చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు సానుకూలంగా పరిష్కరించే వరకూ ఆందోళన ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, టిడిపి నగర నాయకులు చోడే వెంకటరత్నం, పూజారి నిరంజన్, రెడ్డి నాగరాజు, అమరావతి అశోక్, మారం అను తదితరుల బృందం సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి పి.పోతురాజు, పి.నాగరాజు, బి.వెంకటేశ్వరరావు, అర్లప్ప, దావీదు, బండి రాజు, రాము, మేతర పాప, మరియమ్మ, బండి భవాని, నాగమణి, రమణమ్మ, దుర్గ, భాగ్యలక్ష్మి నాయకత్వం వహించారు.



జంగారెడ్డిగూడెంలో..



ఏలూరులో..

చింతలపూడి:నగరపంచాయతీ కార్మికులు సమ్మె నాలుగోరోజూ కొనసాగింది. ఈనెల 31వ తేదీలోపు ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో అన్నివిభాగాల విధులను పూర్తిగాబహిష్కరిస్తామని చింతలపూడి నగరపంచాయతీ మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. వీరికి టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్‌లు అందించాలని, సిఎం జగన్ పాదయాత్రలో కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18500, మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గౌరవవేతనం రూ.26వేలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు డాక్టర్ మారుమూడి థామస్, టిడిపి టౌన్ ఉపాధ్యక్షులు పొదిలి రాయప్ప, రైతు అధ్యక్షులు రావెళ్ల హనుమంతరావు, వెంగళరావు, వనమాల శ్రీను, పూడి రమణ, మూజి చౌదరి, సూరిబాబు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సమ్మెలో వాటర్ వర్క్స్ సిబ్బంది, స్వీపర్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నాలుగో రోజు మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగించారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బర్రె బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జి.లక్ష్మణ్, రాజు, వినోద్, పెంటయ్య, మంగమ్మ, మేరీ, తులసి పాల్గొన్నారు.

నూజివీడు : మున్సిపల్ కార్మికుల సమ్మె నూజివీడులో నాలుగో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని, మున్సిపల్ కార్మికులకు నష్టం కలిగించే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవిందు, రాణి, పద్మ, రజని, గాంధీ, సాయి, ఏడుకొండలు, రాజేంద్ర, చంద్రశేఖర్, జయరాం, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో..

కాంట్రాక్టర్లపైనే శ్రద్ధ

మున్సిపల్ వెహికల్ డిపో వద్ద క్లాప్ ఆటో డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థ ఒక్కో క్లాప్ ఆటోకు (ఇంటింటి చెత్త సేకరణ ఆటో) కాంట్రాక్టర్లకు నెలకు రూ.54 వేలు చెల్లిస్తుందని, కాంట్రాక్టర్‌కు, డీజిల్, జీతాలు, ఇఎంఐల నిమిత్తం నెలకు రూ.24 వేలు కూడా ఖర్చుకావడం లేదని, క్లాప్ ఆటోకు కాంట్రాక్టర్లకు నెలకు రూ.30వేలు మిగులుతుందని, నగరంలోని 60 ఆటోలకు నెలకు రూ.18 లక్షలు మిగులుతోందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. కాంట్రాక్టర్లకు మిగిలే లక్షలాది రూపాయల్లో ఒక్క ఆటో డ్రైవర్‌కి అదనంగా రూ.ఐదు వేలు చెల్లించినా కాంట్రాక్టర్లకు నెలకు ఇంకా రూ.15 లక్షలు మిగులుతుందని తెలిపారు. ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే చూస్తున్నారు తప్ప కష్టపడే డ్రైవర్లకు జీతాలు పెంచడానికి ముందుకు రావడంలేదని విమర్శించారు. స్థానిక వంగాయగూడెంలోని మున్సిపల్ వెహికల్ డిపో వద్ద క్లాప్ ఆటో డ్రైవర్లు కనీస వేతనాలు రూ.18,500 అమలు కోసం మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో దళారీ వ్యవస్థను రద్దు చేస్తానని చెప్పి క్లాప్ ఆటోల రూపంలో ఆ వ్యవస్థను ప్రవేశపెట్టిందని విమర్శించారు. మున్సిపాలిటీ ప్రజల సొమ్మును ప్రభుత్వ, మున్సిపల్ అధికారులు క్లాప్ ఆటోల కాంట్రాక్టరుకు అప్పనంగా కట్టబెడుతున్నారన్నారు. క్లాప్ ఆటోల కాంట్రాక్టర్ లేబర్ కమిషనర్ ఆదేశాలు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఒప్పందానికి అనుగుణంగా డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 చెల్లించే వరకూ సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఏలూరు నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, యూనియన్ నాయకులు బంగారు వెంకటేశ్వరరావు, తానంకి జార్జి, పంతం చిన్న నాగరాజు మద్దతు తెలిపారు. క్లాప్ ఆటోల సమ్మెకు గణేష్, హరీష్, సుగుణరావు, అంబేద్కర్, నాగరాజు నాయకత్వం వహించారు.

రావాలి జగన్.. కావాలి ఎలిజా..!

మంత్రి మిధున్‌రెడ్డి నివాసం వద్ద చింతలపూడి వైసిపి నేతల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి టిక్కెట్‌ను మరోసారి ఉన్నమట్ల ఎలిజాకు కేటాయించాలని ప్రముఖ వైసిపి నాయకులు ఆత్కూరి సుబ్బారావు, పట్టణ అధ్యక్షుల కొప్పుల నాగు ఉభయగోదావరి జిల్లాల వైసిపి సమన్వయకర్త, ఎంపీ మిధున్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా విజయవాడలోని మంత్రి నివాసం ముందు శుక్రవారం బఠాయించి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కర్యకర్తలు నిరసన తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మళ్లీ ఎలిజాకే చింతలపూడి టిక్కెట్‌ను కేటాయించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. వందపడకల ఆసుపత్రి, బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల వంటి ప్రజల చిరకాల కోరికతీర్చారన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల దిలీప్, టి.శ్రీనివాసరావు, సిటీమెడికల్ దుర్గారావు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది'

జంగారెడ్డిగూడెం : అంగన్వాడీ వర్కర్స్ గత 17 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం కనపరుస్తుందని అంగన్వాడీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భారతి అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ జిల్లా తరగతులు స్థానిక యుటిఎఫ్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ తరగతులకు పి.శాంతి, జి.విమల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్‌తో వెట్టి చాకిరీ చేయించుకుని మొండి చేయి చూపిస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. గ్రాడ్యుటీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు సహాయ కార్యదర్శి షేక్ సుభాషిని పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలపై దృష్టి పెట్టాలి : జెసి

ఆగిరిపల్లి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేకదృష్టి పెట్టి సత్వరమే వాటిని పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆగిరిపల్లి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించి 113 అర్జీలు రాగ, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 77 అర్జీలు రావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పోలవరం : మండలంలోని కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. జిల్లా పరిషత్, కొవ్వాడ కాలువ క్రాసింగ్ వద్ద నిర్మిస్తున్న కాజువే, ఎప్రోచ్ రోడ్డు పనులు సుంకర వెంకటరెడ్డి పరిశీలించారు. ఆయనతో కొత్తపట్టిసమ సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిటిసి వలవల వరలక్ష్మి, ఎఒ సిహెచ్.శ్రీనివాస్ బాబు, మైగాపుల దుర్గాప్రసాద్, గ్రామస్తులు వున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ పెంపొందించాలి

నూజివీడు రూరల్ : నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి అశోక్ కుమార్‌గౌడ్ శుక్రవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్ రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. రిసెప్షన్ కౌంటర్, పలు రికార్డుల నిర్వహణపై అనేక సూచనలు చేశారు. ప్రతి ఒక్కరితో ఫ్రెండ్లీ పోలీసింగ్ పెంపొందించాలి అని సూచించారు.

బలివేలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ముసునూరు : టిడిపి అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ గద్దె రఘుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని బలివే గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు చిన్నం శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'రైతులకు ప్రభుత్వాలు చేసిందేమీ లేదు'

ముసునూరు : దేశానికి రైతే వెన్నుముక అంటూ గొప్పలు చెప్పటమే తప్ప రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో జిల్లా రైతు సంఘం ప్రథమ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రాయ్యంకుల లక్ష్మణరావు, టిడిపి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగారామ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదినేపల్లి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని పెదపాలపర్రు సమీపంలో జరిగింది. ముదినేపల్లి నుంచి గుడివాడ వైపు వెళుతున్న బైక్‌ను గుడివాడ వైపు నుంచి ముదినేపల్లి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రున్ని చికిత్సకై 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే క్షతగాత్రున్ని వివరాలు తెలియరాలేదు.

ఒంటి కాలుపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

18వ రోజు కొనసాగిన సమ్మె



జీలుగుమిల్లి : ఒంటి కాళి మీద నిలబడి నిరసన తెల్పుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 18వ రోజు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటి కాలుతో నుంచొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సిపిఎం, సిఐటియు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అప్పారావు, సిఐటియు కార్యదర్శి కొండలరావు, ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలోని టిడిపి బృందం, భీమడోలు బార్ అసోసియేషన్ సభ్యులు, యుటిఎఫ్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి వారు కొనసాగిస్తున్న దీక్షలకు సంఘీభావాన్ని తెలియజేశారు.

నూజివీడు: నూజివీడు పట్టణంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మె 18వ రోజుకు చేరుకున్న సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, రమాదేవి, కృష్ణకుమారి, పద్మ, మనీ, వసుంధర, జాన్సీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రులో అంగన్‌వాడీ వర్కర్స్ 18వ రోజు సమ్మెలో భాగంగా కళ్లకు నల్లపురంగు గంతలు కట్టుకొని, మోకాళ్లపై నిలబడి నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, ఆర్.రామలక్ష్మి, నిమ్మల పార్వతి, ఎ.నాగమణి పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 18 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు పోస్ట్ కార్డులతో నిరసన ప్రదర్శన చేశారు.

ఏలూరు అర్బన్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా 18వ రోజు గురువారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేసి, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు, యూనియన్ అధ్యక్షులు టి.రజిని, యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని పాల్గొన్నారు.

కలిదిండి : ఎంపిడిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 18వ రోజూ కొనసాగింది. ఒబిసి నాయకులు లావేటి వీర శివాజీ శిబిరానికి చేరి సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

చాట్రాయి : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రారంభించిన నిరవధిక సమ్మె 18వ రోజు కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో విజయ, కళ్యాణి, జమలమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీ కార్యకర్తలు పలువురు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ముదినేపల్లిలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో అరుణ, రిబ్కా, పద్మ, మణిలతో పాటు 140 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలోత్సవం విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం ఏలూరులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో జూనియర్స్ విభాగంలో కె.గాయిత్రి 6వ తరగతి శనివారపు పేట, జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థిని గీసిన 'పర్యావరణం' చిత్రానికి తృతీయ బహుమతి వచ్చింది. సిఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి చేతుల మీదుగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమక్షంలో గాయిత్రి ఈ బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాష్ రావు, ఫస్ట్ అసిస్టెంట్ కె.రాజ్‌కుమార్, విజేతను, చక్కని తర్ఫీదు ఇచ్చిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు ఎమ్‌డి.ఇర్షాద్ అహ్మద్‌ను అభినందించారు.

భీమడోలు : హేలాపురి బాలోత్సవ కార్యక్రమాలు విద్యార్థులలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సహకరిస్తాయని గు ండుగొలను శ్రీవిద్యాలయ ఉన్నత పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన హేలాపురి బాలోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవిద్యాలయ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 25 బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను సత్కరించారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ

చింతలపూడి : రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు(సుబ్బారాజు హైస్కూల్లో) రెండు ప్రథమ బహుమతులు లభించాయని ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులిద్దరినీ జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రాష్ట్రస్థాయిలో 100 శాతం హాజరు నమోదు చేసుకొని మొదటి, ప్రథమ బహుమతి విద్యార్థిని కె.మహితకు లభించిందని తెలిపారు. రెండవ, ప్రథమ బహుమతి ఇటీవల జరిగిన రెండు రైలు ప్రమాదాల్లో(బాలాసూర్, పలాస) ప్రమాదాల నివారణకు గాను ఆటోమేటిక్ ఇంటర్ లాకింగ్ సిస్టం, కవాచ్ టెక్నాలజీ ఉపయోగించి ఎలా ప్రమాదాలు నివారించాలో వివరించినట్లు తెలిపారు. ఈ బహుమతులను రాష్ట్రస్థాయి అధికారుల నుంచి అందుకోవడం జరిగిందన్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు కె.మహిత, ఎం.శ్రీ వర్షిని, గైడ్ టీచర్ కె.రవికుమార్ వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్ సుందర్, మండల విద్యాశాఖ అధికారులు రామారావు, ఎస్.కిరణ్ బాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ వారు అభినందనలు తెలియజేశారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

ఏలూరు అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాదకద్రవ్యాల నివారణ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లు కూనా కృష్ణారావు, నోముల రాములు, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

'భూమిపై హక్కు లేని చట్టమే టైటిలింగ్ యాక్ట్'

నూజివీడు రూరల్ : యజమానులకు భూమిపై హక్కులేని చట్టమే ఎపి టైటిలింగ్ యాక్ట్-2022 అని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్య ప్రకాష్ తెలిపారు. నూజివీడు కోర్టు భవనాల వద్ద న్యాయవాదులు టైటిలింగ్ యాక్ట్‌కు నిరసనగా శుక్రవారం ఆందోళన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం 27/2023, జిఓ నెంబర్ 512 రద్దుచేయడానికి న్యాయవాదులు చేస్తున్న పోరాటాలకి మద్దతుగా శుక్రవారం ఏలూరు బార్ అసోసియేషన్ మీటింగ్ హాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొని మద్దతు తెలియజేస్తూ ఈ 512 జిఓను రద్దు చేసే వరకు న్యాయవాదులతో కలిసి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నక్క నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ పి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా అడ్డుకుంటామని రాష్ట్ర పౌర హక్కుల సంఘ నేత నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. గురువారం జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. 8వ రోజు రిలే నిరాహారదీక్షలో న్యాయవాదులు వై.సుగుణ కుమార్, తెల్లం నవీన్, న్యాయవాద గుమస్తాలు దేవినేని మహీంద్రా, కరాటం మునీష్, నిమ్మల గిరి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సేవలు వినియోగించుకోవాలి

భీమడోలు : విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహ్మద్ కోరారు. ఇటీవల కాలంలో గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది భీమడోలు హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష భాగంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కంటి పరీక్షల్లో 52 మంది విద్యార్థులు నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించారు. వీరందరికీ కళ్లజోళ్లు మంజూరయ్యాయి. భీమడోలు హైస్కూల్లో నిర్వహించిన కార్యమంలో వీరందరికీ ఆరోగ్య కేంద్ర సిబ్బంది కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం.కనకరత్నం పాల్గొన్నారు.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం-చేవూరిపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన స్వామివారి అఖండ అన్న సమారాధనతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణతో కలిసి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు సతీమణి దూలం వీరా కుమారి, తనయులు దూలం వీర శ్యామ్ ఫణి కుమార్‌లు పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదానికి కుంభ హారతి ఇచ్చి భక్తులకు వడ్డన చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ గంట సంధ్య, ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

'జనసేనను బలోపేతం చేయాలి'

చింతలపూడి : 2024 టిడిపి జనసేన పొత్తు అధికారంలోకి తీసుకురావాలని మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ అన్నారు. చింతలపూడి పట్టణంలో జనసేన మండల అధ్యక్షులు చిదారాల మధుబాటుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జనసేన బలోపేతం చేయాలని, సమన్వయంతో పనిచేద్దామని అన్నారు. ఎటువంటి విబేధాలు లేకుండా ముందుకు వెళ్ధామని, 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనకు జనసేన అధ్యక్షులు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

జంగారెడ్డిగూడెం : వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా యువ కార్యకర్తలు పనిచేస్తారని వైసిపి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక చిట్టూరి గణేష్ రావు టౌన్ హాల్‌లో గిరిబాబు గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా యూత్ కమిటీ మండల, పట్టణ యువజన నాయకుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు గౌడ్ మాట్లాడుతూ జిల్లా కమిటీ, మండల, పట్టణ యూత్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానాల్లో జిల్లా వ్యాప్తంగా యువతను బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ యూత్ జనరల్ సెక్రెటరీ కందుల దినేష్ రెడ్డి, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు, మణి కిషోర్ వర్మ, చల్లారి నాగబాబు, కొల్లూరి దినేష్, జిల్లా సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎన్‌జిఒల క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు : ఎపి ఎన్‌జిఒస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అసోషియేషన్‌కి సంబంధించిన నూతన క్యాలెండర్ 2024ను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒస్ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ఏలూరు తాలూకా అధ్యక్షుడు గోన్నూరి శ్రీధర్ రాజు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ కె.నాగమణి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు.

'ఆడుదాం ఆంధ్రా'లో బ్యాడ్మింటన్ పోటీలు

భీమడోలు : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు శుక్రవారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. వార్డు, గ్రామస్థాయిల్లో నిర్వహించే క్రీడా పోటీలను మండలంలో ఎంపిక చేసిన నాలుగు క్రీడా మైదానాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా 53 జట్లు పోటీల్లో పాల్గొన్నట్టు భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి తెలిపారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని జనార్ధనవరం గ్రామం యువకులకు నూజివీడు నియోజకవర్గం మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య ఆర్థిక సహాయంతో వాలీబాల్ కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు పోడేటి వెంకటేశ్వరావు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమం దారా సుందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత శ్యాంబెన్ని, వివేక్, శివకృష్ణ, దుర్గ, శ్రీహరి, మారేష్, మురళీ పాల్గొన్నారు.

స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కేటాయింపునకు డ్రా

ఏలూరు టౌన్: ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఈడా)ఆఫీసులో ఏలూరు ఎంఐజి లేవవుట్ 36 ఎకరాల్లో మధ్య తరగతి కుటుంబాలకు, ఉద్యోగస్తులకు అన్ని సౌకర్యాలు కలిగి ఉన్న ఇళ్ల స్థలాలు అతి తక్కువ ధరకు ఇచ్చే పద్ధతిలో గురువారం కొంతమందికి డ్రా తీయటం జరిగింది. డ్రా తీసే కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని డ్రా తీశారు. ఈ కార్యక్రమంలో విసి చంద్రశేఖర్, డిఇ రామారావు, ఈడా స్టాఫ్ పాల్గొని డ్రా తీసే కార్యక్రమం విజయవంతం చేశారు.

నగరపాలక నూతన స్టాండింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థలో ప్రస్తుత స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీ కాలం నేటితో ముగియడంతో నూతన స్టాండింగ్ కమిటికీ ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఇటీవల నామినేషన్ కోరగా 5 నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి. ఇతరులు పోటీలో లేనందున ఎలాంటి ఎన్నిక లేకుండా నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, 41వ డివిజన్ కార్పోరేటర్ ఈదుపల్లి కళ్యాణి దేవి, 11వ డివిజన్ కార్పోరేటర్ కోయ జయగంగ, 17వ డివిజన్ కార్పోరేటర్ పాము పద్మ, 31వ డివిజన్ కార్పోరేటర్ పోతర్లంక లక్ష్మణరావులను ఎన్నికోవడం జరిగింది. ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీకాలం ఈ నెల 31 నుంచి ఒక సంవత్సర కాలం వుంటుందని మేయర్ తెలిపారు.

అంపశయ్యపై అన్నదాత..!

పాలకులు రైతుల గురించి చెబుతున్న మాటలకు.. కార్యాచరణకు ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది. ఈ సంవత్సరం రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు రైతును నిలువునా ముంచాయి. ఈ ఏడాది భారీ వర్షాలకు, కరువుకు లక్షకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతింది. సాగు చేసిన రైతుకు ప్రభుత్వం ఏమాత్రం అండగా నిలబడలేకపోయింది. నష్టపరిహారం, బీమా, పంట రుణాలు ఏఒక్కటీ సాగుదారుడైన కౌలురైతులకు అందలేదు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ తీరు ఏమాత్రం మారలేదు. రబీ, ఖరీఫ్‌ల్లో సైతం మిల్లర్లకు ఎదురు సొమ్ము చెల్లించాల్సిన దుస్థితి కొనసాగింది. ధరలేక, మేత ధర పెరిగి ఆక్వారైతుల పరిస్థితి దారుణంగా మారింది. పెరిగిన ఖర్చులకు, పంటలకిచ్చే మద్దతు ధరకు మధ్య పొంతన లేకపోవడంతో వ్యవసాయం చేస్తున్న అన్నదాత అంపశయ్యపై కొట్టుమిట్టాడుతున్నాడు.



- ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పంట నష్టం
- దుర్భర పరిస్థితుల్లో కౌలురైతులు
- నరకప్రాయంగా ధాన్యం కొనుగోళ్లు
- ధర తగ్గి, మేత ధరలు పెరిగి ఆక్వారైతు విలవిల
- కాగితాల్లోనే ఆధునికీకరణ
- ధర లేక పామాయిల్, కొబ్బరి, మామిడి రైతులు ధమాల్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారే. ఈ సంవత్సరం జిల్లాలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలతోపాటు ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. రెండు జిల్లాల్లోనూ రబీలో 3.50 లక్షల ఎకరాల్లో, ఖరీఫ్‌లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, లక్షా 20 వేల ఎకరాల్లో పామాయిల్, 40 వేల ఎకరాల్లో పొగాకు, 50 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మామిడి, ఇక పత్తి, కొబ్బరి, మిరప వంటి పంటలతోపాటు రెండు జిల్లాల్లోనూ దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు రైతులు చేస్తున్నారు. ఒకపక్క తుపాన్లు, వరదలు, మరోపక్క కరువు విలయతాండవంతో రైతులు కోలుకోలేని స్థితికి చేరుకున్నారు.



వరి రైతు విలవిల

వరిసాగులో ఉమ్మడి పశ్చిమగోదావరికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ ఏడాది రబీలో ఏలూరు జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 57 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. నీటిఎద్దడి సమస్యను ఎదుర్కొని, వంతులవారీ విధానంలో రాత్రీ పగలు చెమటోడ్చి పంట పండించారు. తీరా మాసూళ్లు చేసే చివరి దశలో వర్షాలు ముంచెత్తాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధాన్యం కొనుగోలు సరిగా జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తేమశాతం, తూకం పేరుతో మిల్లర్లకు ఎదురు సొమ్ము చెల్లించాల్సి వచ్చింది. గోనె సంచులు అందక, రవాణాకు లారీలు దొరక్క రైతులు సతమతమయ్యారు. సకాలంలో సొమ్ము చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఖర్చులు పెరగడంతో పెట్టుబడి తడిసి మోపెడైంది. దీంతో మిగులు అనేది లేకపోగా నష్టాలు మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలు, పశ్చిమలో 2.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. వర్షాకాలం నాలుగు నెలల్లో ఒక్క జులైలో మినహా మిగిలిన మూడు నెలలు వర్షాలు కురవలేదు. దీంతో నీటిఎద్దడి సమస్యతో రైతులు విలవిల్లాడారు. ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతంలో కరువు విలయతాండవం చేసింది. చింతలపూడి, చాట్రాయి, ద్వారకాతిరుమల, కామవరపుకోట, బుట్టాయగూడెం ఇలా 11 మండలాల పరిధిలో 12 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. పంట పశువులకు మేతగా మారింది. ఇది అధికారిక లెక్కల ప్రకారమే. సాగునీరు అందక 50 శాతంపైగా దెబ్బతిన్న పంటపొలాలు మరో ఎనిమిదివేల ఎకరాల వరకూ ఉన్నాయి. మోటారు బోర్ల నుంచి నీరురాని పరిస్థితి ఏర్పడింది. తమను ఆదుకోవాలంటూ రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పంట నష్టపరిహారం చిల్లిగవ్వ ఇవ్వలేదు. జిల్లాలో ఏ ఒక్క మండలాన్నీ కరువు మండలంగా గుర్తించని పరిస్థితి ఉంది. పంట చేతికొచ్చే సమయంలో డిసెంబర్ మొదటి వారంలో విరచుకుపడిన మిచౌంగ్ తుపాను దెబ్బకు రెండుజిల్లాల్లోని వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం చెబుతున్న అధికారిక లెక్కల ప్రకారం 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంట పశ్చిమలో 49,495 ఎకరాలు, ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాలు. మొత్తం 80 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. తుపాన్, వరదలు, కరువుతో ఈ ఏడాది లక్షకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతింది. ఖరీఫ్‌లోనూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తప్పలేదు. రంగుమారిన, తేమకు సంబంధించిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదు. దీంతో తేమశాతం 17 దాటిన తర్వాత ఒక్కింటికి రూ.20 చొప్పున మిల్లర్లకు ఎదురుసొమ్ము చెల్లించి రైతులు ధాన్యం విక్రయించారు. ఆఫ్‌లైన్‌లో రైతులు అయినకాడికి ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చింది. తుపానుతో మరోపక్క రబీ నారుమడులు ఆలస్యం కావడంతో వచ్చే ఏడాది పంటపైనా తీవ్ర ప్రభావం పడనుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో వరిరైతుల పరిస్థితి దారుణంగా మారింది.

దుర్భర స్థితిలో కౌలురైతులు

రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఈ ఏడాది ఏలూరు జిల్లాలో 57 వేల మందికి, పశ్చిమలో 89 వేల మంది మొత్తం లక్షా 46 వేల మంది కౌలురైతులకు మాత్రమే సిసిఆర్‌సి (సాగుదారుని హక్కు పత్రాలు) జారీ చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లోనూ 70 వేల మంది కౌలురైతులకు కేవలం రూ.424 కోట్లు మాత్రమే బ్యాంకులు పంటరుణాలు మంజూరు చేశాయి. రుణార్హత కార్డులు జారీ చేసిన సగం మందికి కూడా రుణాలు అందలేదు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఇ-క్రాప్ ఆధారంగా పంటనష్టం నమోదు ప్రక్రియ జరగడంతో కౌలురైతులకు తీరని అన్యాయం జరిగింది. చివరకు పండించిన ధాన్యం కూడా భూయజమాని పేరునే అమ్మాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. కౌలుచట్టంలో మార్పు చేసి వైసిపి ప్రభుత్వం కౌలురైతులను నిలువునా దెబ్బతీసింది. రబీ, ఖరీఫ్‌లోనూ ధాన్యం తడిసి, సరైన ధర లేక నష్టపోయిన కౌలురైతులకు ప్రభుత్వం ఎటువంటి సాయమూ అందించలేదు. దీంతో సాగు చేయాలంటేనే కౌలురైతులు భయపడుతున్నారు.

కష్టాల కడలిలో ఆక్వారైతు

ఈ ఏడాది రొయ్య, చేప వంటి ఆక్వాసాగు చేస్తున్న రైతుల పరిస్థితి దుర్భంగా మారింది. సరైన ధర లేక, మేత ధరలు పెరిగి ఆక్వారైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రెండు జిల్లాల్లోనూ దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఇందులో రొయ్యల సాగు విస్తీర్ణం దాదాపు లక్షా 20వేల ఎకరాల్లో ఉంది. మేత ధరలపై దిగుమతి సుంకం 15 నుంచి 30 శాతానికి పెరిగిపోయింది. దీంతో ఆక్వాసాగులో అత్యధిక ఖర్చు మేతకే అయిపోతుంది. సోయాబీన్ ధరలు పెరగడంతో 25 కిలోల మేత బస్తాపై రూ.125 పెరిగింది. గతేడాది కంటే ఈ ఏడాది ఎకరాకు రూ.75 వేలకుపైగా మేత ఖర్చు అదనంగా అయినట్లు రైతులు చెబుతున్నారు. ఒకపక్క మేత ధరలు విపరీతంగా పెరగ్గా, రొయ్య, చేప ధరలు మాత్రం భారీగా తగ్గడంతో రైతులు నష్టాలను చవిచూశారు. రొయ్య వందకౌంట్ ధర రూ.250 నుంచి రూ.180కు పడిపోయింది, వందకౌంట్ రొయ్య ఉత్పత్తి చేయాలంటే ఖర్చు రూ.240 అవుతోంది. ఈ విధంగా ఆక్వా ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు భారీ నష్టాలను చవిచూశారు. మేత ధరలకు సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోని పరిస్థితి. వర్షాలు కురవకుండా ఎండలు విపరీతంగా కాయడంతో రొయ్య సాగుపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో రొయ్యల చెరువులు దెబ్బతిని నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో రూప్‌చంద్ చేపల సాగు ఎక్కువగా జరుగుతోంది. కిలో రూ.80కి పైగా పలికే ధర రూ.60కు పడిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు.

కాగితాల్లోనే ఆధునికీకరణ

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక డెల్టా ఆధునికీరణను పూర్తిగా గాలికొదిలేసింది. ఈ ఏడాది సైతం ఆధునికీకరణ పనులు ఏ ఒక్కటీ చేపట్టని పరిస్థితి నెలకొంది. తూడు, గుర్రపు డెక్క పనులు వంటివి తూతుమంత్రంగా చేయడం తప్ప దెబ్బతిన్న షట్టర్లు బాగు చేయించడం వంటివేమీ జరగలేదు. దీంతో చిన్నపాటి వర్షాలకు సైతం వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. ఈ నాలుగున్నరేళ్లలో ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో కాలువలన్ని మెరకతేరిపోయాయి.

పామాయిల్, , కొబ్బరి , మామిడి రైతు కుదేల్

జిల్లాలో అతిపెద్ద వ్యవసాయసాగులో ఆయిల్‌పామ్ ఒకటి. దాదాపు లక్షా పది వేల ఎకరాల్లో రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పామాయిల్ రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. గతేడాది టన్ను పామాయిల్ గెలల ధర రూ.23 వేలు పలికింది. ఈఏడాది ధర ఆమాంతంగా రూ.12,900కు పడిపోయింది. గతేడాది ధర ఎక్కువగా ఉండటంతో పామాయిల్ కౌలుధర ఎకరాకు రూ.లక్ష దాటేసింది. తెల్లదోమ సోకి దిగుబడి సైతం తగ్గిపోయింది. పది టన్నులు దిగుబడి రావాల్సిన తోట ఏడెనిమిది టన్నులు మించలేదు. ఎకరా పామాయిల్ సాగుకు రూ.లక్షా 50 వేల వరకూ ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇచ్చిన ధరతో రూ.90 వేలు ఆదాయం కూడా రాలేదు. రెండు జిల్లాల్లోనూ దాదాపు 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. సాగు ఖర్చులు పెరిగిపోయాయిగాని కొబ్బరి కాయ ధర మాత్రం రూ.ఆరు, ఏడు మాత్రమే పలుకుతోంది. ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. సరైన ధరలేక ఈఏడాది మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. జిల్లాలో 40వేల ఎకరాల్లో పొగాకు సాగు ఉండగా ధర హెచ్చుతగ్గులతో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అగ్రిమెంట్లు లేకుండానే మొక్కజొన్న సాగు

మొక్కజొన్న రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. ఇందులో దాదాపు 50 వేల నుంచి 60 వేల ఎకరాల్లో కంపెనీలు ఇచ్చే సీడ్స్ పంట సాగవుతోంది. నిబంధనల ప్రకారం సీడ్స్ ఇచ్చే కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాయాలి. సీడ్ దెబ్బతింటే రైతులకు నష్టపరిహారం కంపెనీలే చెల్లించాలి. అయితే జిల్లాలో ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. నూజివీడు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో నాసిరకం సీడ్స్‌తో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. మొక్కజొన్న రైతులకూ ప్రభుత్వం ఏమాత్రం అండగా నిలవని పరిస్థితి ఉంది.